## 'నామా' గెలుపునకు ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాల్వంచ, మే 5 : ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని నెహ్రూనగర్ ఏరియాలో 14వ వార్డు 83వ బూత్‌లో బూత్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు దాస నాగేశ్వరరావు ఇంటింటికీ తిరుగుతూ పోస్టర్లు అంటిస్తూ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో దాసరి నాగేశ్వరరావు, విజయ్, దాసరి శేఖర్, దారా రాములు, జంగం రామకృష్ణ, కల్యాణి, వెంకటరమణ, లక్ష్మి, త్రిపుర పాల్గొనర్నారు.

**కొత్తగూడెం మున్సిపాలిటీలో..**

కొత్తగూడెం అర్బన్, మే 5 : నామా నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 29, 30 వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూసన సంధ్య, వాసు దంపతులు, కనుకుంట్ల శ్రీను, పార్వతి దంపతుల ఆధ్వర్యంలో సన్యాసిబస్తీ, మధురబస్తీల్లో గడప గడపకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న వగ్గెల పూజ

అన్నపురెడ్డిపల్లి, మే 5: మండలంలోని బూర్గుగూడెం గ్రామస్తుడు షేక్ ఆరిఫ్ రేకుల ఇల్లు ఈదురు గాలులు-వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నది. అతడిది నిరుపేద కుటుంబం. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు వేముల హరీష్ స్పందించారు. ఆరిఫ్ కుటుంబానికి పార్టీ నియోజకవర్గ నాయకురాలు వగ్గెల పూజ ద్వారా ఆదివారం రూ.10 వేలు సాయంగా అందించారు. నాయకులు మున్నా గోపాలరావు, కిరణ్, శివ, సుభాని, నవీన్, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

## రామయ్యకు స్వర్ణ పుష్పార్చన



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, మే 5: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలో మూలవరులకు అర్చకులు ఆదివారం 108 స్వర్ణ పుష్పాలతో అర్చన, ప్రత్యేక అభిషేకం చేశారు. నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

## ఎప్‌సెట్ మోడల్ పరీక్ష



పరీక్ష పేపర్‌ను ఆవిష్కరిస్తున్న నోడల్ ఆఫీసర్ సులోచనారాణి

భద్రాచలం, మే 5: ఇంజినీరింగ్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎప్‌సెట్) మోడల్ పరీక్షను స్థానిక లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థ ఆదివారం నిర్వహించింది. పరీక్ష పత్రాన్ని నోడల్ ఆఫీసర్ సులోచనారాణి ఆవిష్కరించారు. లిటిల్ ఫ్లవర్స్ డైరెక్టర్ మాగంటి రమేష్ బాబు, అధ్యాపకుడు బషీర్ పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూములో ఈవీఎంలు



ఈవీఎంలను స్ట్రాంగ్ రూములో భద్రపరుస్తున్న అధికారులు

మణుగూరు టౌన్, మే 5: మహబూబాబాద్ ఎస్టీ రిజర్వ్‌డ్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోగల పినపాక సెగ్మెంట్లలోని 250 పోలింగ్ స్టేషన్లకు చెందిన ఈవీఎంలను ఎన్నికల అధికారులు ఆదివారం స్ట్రాంగ్ రూములోకి తరలించారు. అక్కడ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ



నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# బొగ్గు లారీ వస్తున్నది.. జాగ్రత్తగా ఉండండి..!



టేకులపల్లిలోని బోడు రోడ్డు సెంటర్‌లో, ఆదివారం రద్దీగా ఉన్న రోడ్డుపై వెళ్తున్న ఈ బొగ్గు లారీని చూశారా...! అధిక లోడుతో, కనీస జాగ్రత్తలు కూడా పాటించని ఇలాంటి బొగ్గు లారీలు రోడ్డుపై వెళ్తున్నప్పుడు మీరు చాలా జాగ్రత్తగా ఉండండి. మీరు ఏమాత్రం అజాగ్రత్తగా, ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం ముంచుకు రావొచ్చు. ఈ లారీ, సింగరేణి కోయగూడెం ఓపెన్ కాస్ట్ (కేవోసీ) గని నుంచి బొగ్గును తీసుకెళ్తున్నది. ఆ బొగ్గు లోడుపై వెనుక భాగాన పట్టా కప్పలేదు. ఈ లారీ వేగంగా వెళ్తున్నప్పుడు ఈదురు గాలులొస్తే.. ఆ బొగ్గు పైకి ఎగిరి ఇళ్లు-దుకాణాల మీదనో, లోపలనో పడుతుంది. స్పీడ్ బ్రేకర్ వద్దనో.. ఏదైనా అడ్డం వచ్చినప్పుడో ఆ లారీ సడన్‌గా ఆగితే ఏమవుతుందో తెలుసా..! లారీలో అలా ఎత్తుగా పోసిన బొగ్గు అటూ ఇటూ చెల్లాచెదురుగా పడిపోతుంది. పక్కనే పాదచారులో, వాహనదారులో వెళ్తున్నట్లయితే.. వారి మీద పడుతుంది. ఆ బొగ్గు సైజు పెద్దదిగా ఉండి.. అటుగా వెళ్తున్న మనుషుల మీదనో, పిల్లల మీదనో, వృద్ధుల మీదనో పడిపోతే వారికి గాయాలు కావొచ్చు. వాహనదారులపై పడితే.. రోడ్డు ప్రమాదాలు జరగొచ్చు.

**బాధ్యత ఎవరిది..?**

'ఇలా జరిగితే.. దానికి బాధ్యత ఎవరిది? ఆ బొగ్గు లారీ డ్రైవర్‌దా? దాని యజమానిదా? రవాణా కాంట్రాక్టర్‌దా? ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా, ఇలా పబ్లిక్‌కు (ప్రజలకు) ముప్పు వాటిల్లేలా పబ్లిగ్గా (బహిరంగంగా) బొగ్గు రవాణా చేస్తున్నా కూడా చూసీచూడకుండా, ఏమాత్రం పట్టించుకోకుండా, బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న సింగరేణి అధికారులదా? లోడ్ పరిమితంగా ఉన్నా, బొగ్గుపై పూర్తిగా పట్టా కప్పినా.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ ఉండకపోవచ్చు. భద్రతా సూత్రాలను నిత్యం వల్లె వేసే సింగరేణి అధికారులకు ఈ చిన్న విషయం తెలియదని అనుకోవాలా..? తెలిసినా కూడా పట్టించుకోకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి.. ఏమనుకోవాలి..?' - ఇవన్నీ, పబ్లిక్ మొత్తం పబ్లిగ్గా అడుగుతున్న ప్రశ్నలు. సింగరేణి అధికారులు జవాబులు చెప్పాల్సిన ప్రశ్నలు.

- టేకులపల్లి, మే 5

# దగాకోరు కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పాలి



అశ్వారావుపేట రూరల్: మాట్లాడుతున్న ఎంపీపీ



చండ్రుగొండ: డోర్ పోస్టర్ అతికిస్తున్న నాయకులు



అన్నపురెడ్డిపల్లి: పోస్టర్ ఆవిష్కరిస్తున్న వగ్గెల పూజ

అశ్వారావుపేట రూరల్, మే 5: దగాకోరు కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం నేర్పాలని బీఆర్ఎస్ నాయకుడు, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ మండలంలోని రామన్నగూడెం, మల్లాయిగూడెం, అనంతారం, గాండ్లగూడెం, బచ్చువారిగూడెం, నారాయణపురం, గుమ్మడివల్లి, నందిపాడు, దురదపాడు, మొద్దులమాడ, మామిళ్లవారిగూడెం, తిరుమలకుంట, రెడ్డిగూడెం, వినాయకపురం పంచాయతీల్లో పార్టీ ఎన్నికల బూత్ కమిటీలతో సమావేశాలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను, గద్దెనెక్కాక వాటిని గాలికి వదిలేయడాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చెప్పారు. ''మహాలక్ష్మి పేరుతో ప్రతి పేద మహిళకు రూ.2500 ఇస్తామన్నారు. రైతుబంధు రూ.15వేలు ఇస్తామన్నారు. వడ్లకు, మక్కలకు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఇస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తామన్నారు. యువ వికాసం పేరుతో విద్యార్థులకు విద్య భరోసా కార్డులు, నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతామన్నారు. వీటిలో ఏ ఒక్కటైనా ఇచ్చారా..? చెప్పింది చేశారా..? ఎన్నికలకు ముందు ఇవన్నా చెప్పి, గెలిచాక గాలికొదిలేస్తారా? ప్రజలను దగా చేస్తారా..?' అని ప్రశ్నించారు. ఇలాంటి దగాకోరు పార్టీకి ఎందుకు ఓట్లేయాలో, మరోసారి ఎందుకు గెలిపించాలో ప్రజలంతా ప్రశ్నించేలా చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించేందుకు గడప గడపకూ వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు యూఎస్ ప్రకాశరావు, జూపల్లి వెంకట రమణారావు, అంకత మల్లికార్జునరావు, సంకా ప్రసాద్, మందపాటి రాజమోహన్‌రెడ్డి, కాసాని చంద్రమోహన్, తాడేపల్లి రవి, బిర్రం వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ, మే 5: నామా నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకుడు చీదెళ్ల పవన్‌కుమార్ ఆదివారం చండ్రుగొండ పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డోర్ పోస్టర్లను అంటించారు. నాయకులు సూర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి, మే 5: నామా నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకురాలు వగ్గెల పూజ ఆదివారం మండలం అబ్బుగూడెంలో డోర్ పోస్టర్ ఆవిష్కరించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకుడు చెరుకూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మణుగూరు టౌన్: ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**మాలోత్ కవితను గెలిపించాలని..**

మణుగూరు టౌన్, మే 5: మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ జడ్పీటీసీ మెంబర్ పోశం నరసింహారావు, నాయకులు ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అడపా అప్పారావు, కుర్రి నాగేశ్వరరావు, లక్ష్మయ్య, సృజన్, రవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు, మే 5: బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పార్టీ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి ఆదివారం టేకులచెరువు, కొత్తతండా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు పొడియం నరేంద్ర, వళదాసు సాంబయ్య, పాండవుల దర్గయ్య, బండారు లక్ష్మీనారాయణ, పెదలింగయ్య, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపహాడ్: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## కరకగూడెంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

కరకగూడెం, మే 5: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కరకగూడెంలో పోలీసులు ఆదివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా వినియోగించుకునేలా చూడడమే తమ లక్ష్యమని ఏడూళ్ల బయ్యారం సీఐ కరుణాకర్, కరకగూడెం ఎస్ఐ రాజేందర్ అన్నారు. ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేలా చూసేందుకు, పటిష్ట భద్రతాచర్యలు చేపట్టామన్న సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఫ్లాగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూస్తున్న పోలీస్ శాఖకు ఆయా పార్టీల నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

# శుభకార్యానికెళ్తే దిగ చెమటలు

- కార్మిక కుటుంబాల వేడుకల కోసం గౌతంపూర్‌లో కమ్యూనిటీ హాల్
- అధిక ఉష్ణోగ్రతల వేళ అందులో ఏసీలు లేక కుటుంబాల ఇక్కట్లు
- గనుల్లో చెమట చిందిస్తున్న కార్మికులకు బయట ఆదరణ తగ్గించిన సింగరేణి

రామవరం, మే 5: ఆ సంస్థ ఏటా లాభాలతో దూసుకుపోతోంది. ఏటికేడు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ వెళ్తోంది. దక్షిణ భారత దేశంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. అదే సింగరేణి. ఇదంతా ఆ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల రెక్కల కష్టం. చెమట చుక్కల ఫలితం. కానీ అలాంటి కార్మికులకు కల్పించాల్సిన మౌలిక వసతుల విషయంలో మాత్రం సంస్థ ఒక అడుగు ముందుకు.. రెండు అడుగు వెనక్కు వేస్తున్నట్లు కన్పిస్తోంది. ఇందుకు నిదర్శనమే గౌతంపూర్ కమ్యూనిటీ హాల్ అంశం. కార్మిక కుటుంబాల శుభకార్యాలు, ఇతర అవసరాల కోసం సింగరేణి యాజమాన్యం కొత్తగూడెం ఏరియాలోని గౌతంపూర్‌లో గతంలోనే కమ్యూనిటీ హాల్ నిర్మించింది. ఇది కార్మికుల కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. కానీ వేసవిలో మిగతా ప్రాంతాలకంటే ఇక్కడ సగటు ఉష్ణోగ్రత మరింత అధికంగా ఉంటుంది. అలాగే, వేసవి అంటేనే శుభకార్యాల సమయం. ఈ క్రమంలో ఈ కమ్యూనిటీ హాల్లో ఏసీలు లేకపోవడంతో ఇందులో శుభకార్యాలు జరిపించుకునే వారికి, అతిథులుగా వచ్చిన వారికి దిగ చెమటలు పడుతున్నాయి. ఎక్కువ ఉండాల్సి వస్తే శరీరమంతా చెమటతో తడిసి ముద్దవుతోంది.



గౌతంపూర్ కమ్యూనిటీ హాల్

**టీబీజీకేఎస్ నేతల కృషితో రూ.15 లక్షలు..**

అయితే, కార్మికులు, వారి కుటుంబాల ఇబ్బందుల దృష్ట్యా బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం టీబీజీకేఎస్ నేతలు తమ సంఘం గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు ఏసీల ఏర్పాటు ఆవశ్యకాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి రూ.15 లక్షల నిధులు మంజూరు చేయించారు. వాటితో మొదట సీలింగ్, టైల్స్ ఏర్పాటు చేయించి పేయింటింగ్ వేయించారు. ఈలోపు గుర్తింపు సంఘం మారడంతో ఏసీలు ఏర్పాటుపై కార్యాచరణ కరువైంది.

**ఇప్పటి నేతలెవరూ చొరవ తీసుకోవట్లేదు**



కమ్యూనిటీ హాల్లో ఏసీల ఏర్పాటుకు మా సంఘం ఎంతో కృషి చేసింది. చాలా వరకూ పనులు పూర్తి చేసింది. గుర్తింపు సంఘం ఎన్నికల తరువాత గెలిచిన ఇప్పటి యూనియన్ల నేతలు ఆ హాల్లో ఏసీల ఏర్పాటు విషయంలో చొరవ తీసుకోవట్లేదు. ఏసీలు మంజూరైనప్పటికీ వాటి ఏర్పాటు కోసం ఎవరూ స్పందించడం లేదు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో అధికారులైనా స్పందించి ఏసీలు ఏర్పాటు చేయాలి.

**-కూసన వీరభద్రం,**
**టీబీజీకేఎస్ రీజినల్ సెక్రటరీ**

**తక్షణం ఏసీలు ఏర్పాటు చేయాలి..**



ఇటీవల మా బాబు వివాహం కమ్యూనిటీ హాల్లో జరిపించాను. అందులో ఏసీలు లేకపోవడంతో వివాహానికి వచ్చిన అతిథులు, చిన్నలు, పెద్దలు, వృద్ధులు అనేక అవస్థలు పడ్డారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి. ముందుముందు జరుగనున్న శుభకార్యాలను దృష్టిలో ఉంచుకొని ఏసీలు ఏర్పాటుచేయాలి. ఆవరణ ముందుభాగంలో ఓపెన్ డైనింగ్ హాల్, ఏర్పాటుచేస్తే బాగుంటుంది. వంటశాలను సైతం పెద్దగా కట్టాలి.

**-చెరిపల్లి నాగరాజు,**
**ఉద్యోగి, కొత్తగూడెం ఏరియా**

## 'మతోన్మాద బీజేపీని ఓడించండి'



మాట్లాడుతున్న జాటోత్ కృష్ణ

లక్ష్మీదేవిపల్లి, మే 5 : పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద పాసిస్టు బీజేపీ మిత్రపక్షాలను ఓడించాలని, లౌకిక ప్రజాతంత్ర హక్కుల కోసం నిలబడదామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ అన్నారు. ఆదివారం రేగళ్ల పంచాయతీ స్థాయి ఎన్నికల జనరల్ బాడీ సమావేశం గుగులోత్ రాంచందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల కరపత్రాలు విడుదల చేశారు. ఆజాద్, మిడుదుల రాజశేఖర్, మంగీలాల్, లక్ష్మి, సీతమ్మ, వీరనాగులు, రామారావు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లికి పూజలు



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

పాల్వంచ రూరల్, మే 5 : మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఖమ్మంజిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. సోమవారం యాగశాలలో రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈవో సుదర్శన్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి




సామేలు, పద్మ (ఫైల్)

లక్ష్మీదేవిపల్లి, మే 5 : మండలంలోని అనిశెట్టి గ్రామం వద్ద టీవీఎస్‌పై రోడ్డు దాటే క్రమంలో టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో భార్యాభర్తలు మృతిచెందారు. పాల్వంచ మండలం మంచికంటినగర్‌కు చెందిన కుంపటి సామేలు(57), కుంపటి పద్మ(45) భార్యాభర్తలు ఇద్దరు టీవీఎస్ బండిపై అనిశెట్టిపల్లి క్రాస్‌రోడ్ వద్ద రోడ్డు దాటేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో టిప్పర్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. భార్య అక్కడికక్కడే మృతిచెందింది. భర్త సామేలుకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సామేలు మృతిచెందాడు. భార్యాభర్తల మృతితో వారి కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. పాల్వంచ దమ్మపేట సెంటర్‌లో సామేలు చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బెల్ట్ షాపుపై దాడి.. మద్యం స్వాధీనం



భద్రాచలం: అధికారులు స్వాధీనపర్చుకున్న మద్యం సీసాలు

భద్రాచలం, మే 5: భద్రాచలంలోని పాత మార్కెట్ ఏరియాలో గల బెల్ట్ షాపుపై ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆదివారం దాడి చేశారు. మద్యం బాటిళ్లను స్వాధీనపర్చుకున్నారు.

పర్ణశాల, మే 5: దుమ్ముగూడెం మండలంలోని ఆంధ్రకేసరి నగర్ గ్రామం వద్ద బెల్ట్ షాపుపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి మధు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడి చేశారు. రూ.29,110 విలువైన మద్యాన్ని స్వాధీనపర్చుకున్నారు. షాపు నిర్వహిస్తున్న నాగరాజుపై కేసు నమోదు చేశారు.

## అనాథ అంత్యక్రియలకు సాయం

భద్రాచలం, మే 5: భద్రాచలం వద్ద గోదావరిలో మూడు రోజుల క్రితం అనాథ మృతదేహాన్ని పోలీసులు బయట తీశారు. అంత్యక్రియలకు భద్రాచలం వాసవీక్లబ్ బాధ్యులు రూ.రెండువేలు అందించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాల్వంచ, మే 5 : పట్టణంలోని ఇందిరాకాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీదేవిపల్లి మండలం ఇందిరాకాలనీకి చెందిన సంగం వీరన్న(45) అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం... పాల్వంచ పెద్దమ్మతల్లిని దర్శించుకునేందుకు భార్య, కుమారుడితో వచ్చిన వీరన్న తిరుగు ప్రయాణమయ్యారు. ఇందిరాకాలనీ వద్ద డివైడర్‌ను ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు వినయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వడదెబ్బతో బాలుడు..

భద్రాచలం, మే 5: వడదెబ్బతో బాలుడు మృతిచెందాడు. పట్టణంలోని ముదిరాజ్ బజార్‌కు చెందిన తొమ్మిదోతరగతి విద్యార్థి సంజయ్(14)కు శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు వాంతులు, విరోచనాలు(వడదెబ్బ) అయ్యాయి. తల్లిదండ్రులు తెల్లవారుజామున పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. డాక్టర్ పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు.

## సుక్మా జిల్లాలో ఎదురుకాల్పులు

కొత్తగూడెం క్రైం, మే 5 : ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు, భద్రతాదళాలకు మధ్య ఆదివారం ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని చిన్నబొడ్కెల్, రాయ్‌గుడా, పెద్దబొడ్కెల్, మెడవాహి, జొన్నగూడా, తుమల్‌పాడ్, బండిగూడెం గ్రామాల పరిసర ప్రాంతాల్లోని అటవీప్రాంతాల్లో డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్, కోబ్రా 201, 206 బెటాలియన్ల సంయుక్త ఆధ్వర్యంలో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించారు. మావోయిస్టులు తారసపడి కాల్పులకు దిగారు. వెంటనే జవాన్లు ఎదురుకాల్పులు ప్రారంభించారు. సుమారు రెండు గంటలపాటు భీకరపోరు సాగింది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టుల ప్రాంతం విడిచి పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని గాలించారు. అక్కడ మావోయిస్టులకు చెంది ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనపరుచుకున్నారు. దీనిని సుక్మా ఎస్పీ కిరణ్‌చౌహాన్ ధ్రువీకరించారు.

## క్షతగాత్రుడు మృతి

అన్నపురెడ్డిపల్లి, మే 5: మండలంలోని భాస్కరపురం వద్ద ఈ నెల 2న జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్తుపల్లి మండలం చెరుకుపల్లి గ్రామస్తుడు సున్నం రామకృష్ణ(27)కు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడు అక్కడే ఆదివారం మృతి చెందాడు. ఆయన కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.